వైభవంగా పలహారంబండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: బోనాల సందర్భంగా పట్టణంలో పలహారంబండి ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. సాంప్రదాయ పండగలు మన సంస్కృతిని ప్రతిభింభిస్తాయని, బోనాల పండగ తెలంగాణలో ఎంతో ముఖ్యమైనదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ గోపాల్, మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు సంజయ్ యాదవ్, మేకల వెంకటేష్ ముదిరాజ్, నాయకులు మురళి యాదవ్, నాగేష్ యాదవ్, గొరిగె సిద్దేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేనేజర్‌కు వీడ్కోలు పలికిన చైర్మన్



మేనేజర్ రమేశ్‌ను సత్కరించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: గత ఏడాది కాలంగా మణికొండ మేనేజర్‌గా పనిచేసి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన రమేశ్‌కు మంగళవారం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన స్థానంలో వచ్చిన శ్రీధర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరు ప్రజలకు ఎల్లప్పుడు గుర్తుండేలా ఉండాలన్నారు. తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన వారిని ప్రజలు ఆదరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డి. ప్రదీప్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేసిన కార్పొరేటర్



మొక్కలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

బండ్లగూడ: వనమహోత్సవ కార్యక్రమాన్ని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని పద్మశ్రీహిల్స్ కాలనీలో కార్పొరేటర్ పద్మావతిపాపయ్య యాదవ్ కాలనీ వాసులతో కలిసి ఇంటింటికి తిరిగి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అదే విధంగా కాలనీలో జరుగబోయే బోనాలు ఉత్సవాలలో భాగంగా పోచమ్మ దేవాలయం వద్ద రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు, రాళ్లను, మట్టిని జేసీబీతో తొలగించి శుభ్రం చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్, రాజుయాదవ్, వార్డు అధికారి ఇమ్రాన్, పద్మశ్రీహిల్స్ కాలనీ అధ్యక్షులు కిషోర్‌రెడ్డి, కాలనీ వాసులు కిషోర్‌రెడ్డి మల్లారెడ్డి, సావర్కర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత డబ్బుతో బోరు వేయించిన స్థిరాస్తి వ్యాపారి



బోరు వేసిన స్థిరాస్తి వ్యాపారి సిద్దురెడ్డి, కౌన్సిలర్ వై.కుమార్

శంషాబాద్: పట్టణంలోని 6వ వార్డు మక్తాలో నీటి సమస్య రోజు రోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా సమస్యను పరిష్కరించుకునేందుకు స్థానిక స్థిరాస్తి వ్యాపారి సిద్దురెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు కౌన్సిలర్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక కౌన్సిలర్ వై. కుమార్ చొరవతో స్థిరాస్తి వ్యాపారి రూ. 2 లక్షలు తన సొంత డబ్బులతో మంగళవారం బోరు వేయించారు. బోరులో తగిన స్థాయిలో నీరు కూడా రావడంతో నీటి సమస్యకు కొంత మేరకు పరిష్కారమైందన్నారు. హైదరాబాద్ మెట్రోబోర్డు అధికారులు కూడా పట్టణంలో మంచినీటి సరఫరాను ప్రజల డిమాండ్‌కు సరిపడా పెంచాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

మణికొండ: కోకాపేటలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై కొందరు వెళ్లగా, మరికొంత మంది కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డిలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉన్నత మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం కార్వాన్, టోలిచౌకీ డివిజన్‌లకు చెందిన పలువురు మహిళలు ఆయనను కలవడానికి మేరాజ్ కాలనీలోని కార్యాలయానికి వచ్చారు. తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. తమకు ప్రతి నెలా ఆసరా పింఛన్ సకాలంలో రావడం లేదని ఒకరు, షాదీముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకొని సంవత్సరం గడుస్తున్నా డబ్బులు రాలేదని మరో మహిళ ఆయన దృష్టికి తెచ్చారు.

అంతా మా ఇష్టం

కాటేదాన్ ఇండియన్ ఫార్మసీ ప్రధాన రహదారిపై దర్జాగా అక్రమ పార్కింగ్

- నిత్యం ట్రాఫిక్ జామ్
- రాకపోకలకు ఇబ్బందులు
- దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ ఇండస్ట్రియల్ ప్రధాన రహదారిలో ఇరువైపుల భారీ వాహనాల పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల భారీ వాహనాలు రోడ్లపైనే దర్జాగా పార్కింగ్ చేస్తున్నారు. కాటేదాన్ ఇండియన్ ఫార్మసీ ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ కంటైనర్ వాహనాలతో కొందరు పరిశ్రమల యాజమాన్యం తమ పరిశ్రమలోకి వచ్చిన వాహనాలను అన్నింటిని ఒకేసారి పరిశ్రమలోకి రానివ్వకుండా ప్రధాన రహదారులపై పార్కింగ్ చేసుకోవాలని చెబుతున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. భారీ వాహనాలలో వచ్చిన ముడి సరుకును వెంటనే అన్‌లోడ్ చేసుకోకుండా రోజుల తరబడి వాహనాలను నిలుపుతున్నారు. దీంతో గత్యంతరం లేక భారీ లారీలు రోడ్లపైనే పార్కింగ్ చేసుకొని ఉంటున్నారు.



భారీ వాహనాల మధ్య ఆటోలకు ఇబ్బందులు

స్థానికంగా ఉన్న వాహదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్‌తో ప్రమాదాలు

పరిశ్రమల యాజమాన్యం నిత్యం తమ పరిశ్రమలకు వచ్చే భారీ లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ లేదా లోడ్ చేసుకొని వెంటనే తరలిస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయడం వలను అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ప్రమాదాలు జరిగిన కొన్ని రోజులు వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయకుండా ఉంటారు. కొన్ని రోజుల తరువాత యథావిధిగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ పార్కింగ్‌ను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చేతివాటం చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



రహదారికి ఇరువైపులా భారీ వాహనాల పార్కింగ్

రోడ్లపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలపై చలాన్ వేసినట్లయితే రోడ్లపై పార్కింగ్ చేయకుండా ఉంటారని ప్రజల అభిప్రాయం. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ప్రధాన రహదారిపై పార్కింగ్ చేయకూడదు. అలా పార్కింగ్ చేస్తే తన దృష్టికి తీసుకురావాలి. వెంటనే తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు తీసుకుంటారు.

– కిరణ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..

ఇండియన్ ఫార్మసీ ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపుల అక్రమంగా ఇష్టానుసారంగా భారీ కంటెయినర్లు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రధాన రహదారి గుంతలతో ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారులపై లారీల పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలి.

– గోవింద్‌రాజ్, వాహనదారుడు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని వారికి మంజూరు అయిన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలకు అర్హత ఉన్న వారు ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం వేలాది మందిని అప్పులపాలు కాకుండా నిలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కె. రామకృష్ణారెడ్డి, పి.శైలజ, బి. కావ్యశ్రీరాములు, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, నాయకులు బషీర్, కుమార్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఒక్కరు వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు వట్టినాగులపల్లిలో కౌన్సిలర్ డి.రేఖయాదగిరితో కలిసి ఆమె ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటిస్తున్నామని, వాటితో పాటు లక్షల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేయిస్తున్నామని తెలిపారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు

ధర్నాను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్‌ఎఫ్‌ఏ)ల సమావేశాన్ని ఐబీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న మంగళవారం ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ చేసే వరకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్, అనిల్, చందు, ప్రకాశ్, జ్ఞానేశ్వర్, ఎల్లప్ప, జగన్, జాషువా, వెంకటేష్, సురేశ్, అరుణ్, శ్రీకాంత్, రాజు, వెంకటేష్, మహేందర్, కృష్ణ, గోపాల్, సురేశ్, అశోక్, ఆనంద్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మత్తులో ఉన్న యువకులను స్టేషన్‌కు తరలింపు

శంషాబాద్: గంజాయి తాగుతూ హంగామా సృష్టిస్తున్నారనే సమాచారంతో పలువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని సిద్ధాంతి బస్తీలో యువకులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులకు మంగళవారం ఇస్హాక్ అనే యువకుడి ఇంట్లో దీపక్, వంశీ, పవన్ మరో యువకుడు మత్తులో తూగుతుండగా వారిని పట్టుకున్నారు. మత్తులో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే వారు తాగింది గంజాయి అన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదని ఎలాంటి మత్తు తీసుకున్నారనే దానిపై విచారణ చేస్తున్నామని పోలీసులు పర్కొన్నారు.



బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడి రిమాండ్

శంషాబాద్: నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టిన కామాంధుడిని ఆర్‌జీఐఏ పోలీసులు రిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సిద్ధాంతి బస్తీలో ఓ భవనంలో అద్దె కుంటున్న ఉద్యోగి కుమార్తె(4) పై అదే భవనంలో అద్దెకు ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన రామాంజనేయులు (35) సోమవారం రాత్రి తన గదిలోకి తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. అప్పుడే చిన్నారిని వెతుకుతున్న తల్లిదండ్రులకు బాలిక అతని గదిలో కనబడింది. విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని రామాంజనేయులును పోలీసులకు అప్పగించారు. వైద్యచికిత్సల నిమిత్తం బాలికను ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై ఆర్‌జీఐఏ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శంషాబాద్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికులను ఆయన కలిశారు. ఈ నెల 26న భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇందిరాపార్కువద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేష్, కార్యదర్శులు చందుయాదవ్, జైపాల్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



చంద్రమ్మ

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు కనిపించకుండాపోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్ ప్రాంతానికి చెందిన కొదండ చంద్రమ్మ (65)కు ముగ్గురు కొడుకులు ఉన్నారు. చంద్రమ్మ ప్రతి మూడు నెలలకు ఒకరి ఇంటిలో ఉంటుంది. అదే క్రమంలో వినాయకనగర్‌లో ఉండే తన కొడుకు కొదండ మల్లయ్య దగ్గరికి వచ్చింది. అర్ధరాత్రి కాలకృత్యాలకు బయటకు వెళ్లిన ఆమె ఎంతకీ రాకపోవడంతో అంతట వెతికారు. మతిస్థిమితం సరిగా ఉండని ఆమె ఎక్కడా కనిపించకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో మహిళ..



సానియా ఫాతిమా

అత్తాపూర్: మతిస్థిమితం సరిగా లేని ఓ అమ్మాయి ఆధార్‌కార్డు తీసుకుని ఇంట్లో నుంచి కనిపించకుండాపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మహమ్మద్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్ నగర్ చెందిన మహమ్మద్ నాసర్ తల్లి, సైదా ఫాతిమా కుమార్తె సానియా ఫాతిమా(23). ఈ నెల 20న శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సానియా ఫాతిమా తన ఆధార్‌కార్డు తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తన కూతురు ఎప్పుడు బయటకు ఇంటి పనులకు కూడా వెళ్లదని ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. బంధువులను, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

26న ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

బండ్లగూడ: భవన నిర్మాణ కార్మికుల తాంబూసిస్టం రద్దు చేయాలని కార్మికులందరికి పెన్షన్ సౌకర్యాం కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 26న ఇందిరా పార్కు దగ్గర జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరెమైసమ్మ లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికుల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఇంటి జాగా లేదని అద్దె ఇంట్లో ఉండి జీవనాన్ని గడుపుతున్నారన్నారు. అద్దెలు కట్టలేని దుస్థితిలో కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులందరికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల అడ్డాలలో షెడ్లు నిర్మాణం చేసి మంచినీళ్లు భోజన వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అడ్డ మీద లేబర్ అనేక అవస్థలు పడుతున్నారని, వారందరి సమస్యల పరిష్కారానికై ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, అన్నపు ప్రభు, బాబుమియా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ్యుల సమస్యలను పరిష్కరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న పిఆర్‌టియూటీఎస్ జిల్లా అధ్యక్షులు

బండ్లగూడ: ప్రభుత్వం వెంటనే జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టులను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రేషనలైజేషన్ చేయాలని, బదిలీ అయిన ఎస్‌జీటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పిఆర్‌టియూటీఎస్ జిల్లా అధ్యక్షులు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ కోరారు. జిల్లా శాఖలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సభ్యత్వ పక్షోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టుల విషయంలో ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలన్నారు. సమస్యల సాధన కోసం పిఆర్‌టియూటీఎస్ ఎల్లవేళలా పోరాడుతుందని, ఉపాధ్యాయుల సర్వీసెస్ సాధిస్తామని, 317 జీవోలో జరిగిన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు మల్లేష్, నరసింహులు, కార్యదర్శి శివ రామ్, రాష్ట్ర బాధ్యులు మధుకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సన్మానం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జమిల్ అల్తాఫ్ హుస్సేన్, మేనేజర్ రామ్ నర్సింహా రెడ్డిల వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం బుద్వేల్‌లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు, సిబ్బంది వారికి వీడ్కోలు పలికారు. జమీల్ సాహెబ్‌నగర్‌కు బదిలీ కాగా.. రామ్ నర్సింహా రెడ్డి పెద్ద అంబర్‌పేట్ జల మండలి కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్యాల శ్రీధర్, మేనేజర్లు పి.వినాయక్, శ్రావ్య రెడ్డి, సాయి రెడ్డి, అబ్దుల్ ఖాదర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ స్థలంలో కల్లు కాంపౌండ్‌ను తొలగించాలి

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ సర్వే నంబరు 626లోని పోచమ్మ దేవాయలయానికి సంబంధించిన 200 గజాల స్థలంలో అక్రమంగా కొనసాగుతున్న కల్లుకాంపౌండ్‌ను వెంటనే తొలగించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు బూడిద బిక్షపతి, సభ్యులు బూడిద శివ తదితరులు మాట్లాడుతూ.. ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా దేవాలయానికి కేవలం ఇరవై మీటర్ల పరిధిలోనే కల్లుకాంపౌండ్ కొనసాగుతుందని, దీంతో మహిళలు, భక్తులు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారన్నారు. ఆలయ స్థలంలో ఉన్న కాంపౌండ్‌ను తొలగిస్తామని గతంలో చెప్పిన విక్రేతలు ప్రస్తుతం ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. విక్రయదారులు గుడి స్థలం కాకుండా పక్కనే ఏర్పాటు చేసుకున్న ప్రత్యామ్నాయ స్థలంతోపాటు ఆలయ స్థలంలో కూడా యథాతథంగా విక్రయాలు జరుపుతున్నారన్నారు. కాంపౌండ్ యజమానులు స్వచ్ఛందంగా తొలగించకపోతే జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డీసీపీలను కలిసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాలనీ ప్రజలు అన్నారు. సమావేశంలో మేకల జంగయ్య, చల్లా గాల్‌రెడ్డి ఉన్నారు.

దొంగలు దొరికారు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

- ఆభరణాలు స్వాధీనం
- ఇద్దరి రిమాండ్

రాజేంద్రనగర్: రెండేళ్ల జైలుశిక్షతో పాటు పీడీ యాక్ట్ కింద ఏడాది జైలుకు వెళ్లి వచ్చి పోలీసులకు చిక్కకుండా మూడేళ్లుగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న దొంగలు ఎట్టకేలకు చిక్కారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాల ప్రకారం.. తిమ్మాజీపేట మండలం పుల్లగిరి గ్రామం ప్రాంతానికి చెందిన ముడావత్ పాండు (36) ఇతనిపై 27 కేసులు ఉన్నాయి. రెండేళ్ల జైలు శిక్షతో పాటు పీడీ యాక్ట్ కింద జైలుకు వెళ్లి వచ్చాడు. అదే ప్రాంతానికి చెందిన ముడావత్ సేవ్యా (23), ఇతనిపై 18 కేసులు ఉన్నాయి. వీరిని పీడీయాక్ట్ కింద జైలుకు పంపగా 2022లో బయటికి వచ్చిన వారు మళ్లీ దొంగతనాలకు పాల్పడేవారు. 2022 జనవరి 1న రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ బుద్వేల్ బస్టాప్ వద్ద మహిళ మెడలోని గొలుసు తెంపుకొని పారిపోయారు. 2022 నుంచి 2024 వరకు ఈ ప్రాంతంలో నాలుగు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. నిందితులు ప్రాంతంలో చీకటిని ఆసరాగా చేసుకొని బస్టాపు వద్ద ఉన్న మహిళల మెడలోని గొలుసులను తెంపుకొని పోలీసులకు చిక్కకుండా యూనివర్సిటీలోని పొదల గుండా పారిపోయేవారు. దీంతో పాటు శంషాబాద్‌పరిధిలో రెండు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. దొంగలించిన చైన్‌లను స్థానికంగా ఉన్న వారికే విక్రయించి డబ్బులు తీసుకున్నారు. ఈ నెల 16న డ్యూటీ ముగించుకొని బుద్వేల్ బస్టాపు వద్ద బస్సు కోసం వేచి ఉన్న ప్రభుత్వ నర్సు మెడలోని చైన్‌ను దొంగలించి పారిపోయారు. కేసును సవాలుగా తీసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీతో పాటు క్రైమ్ పార్టీ, సీసీఎస్ పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు ప్రారంభించారు.

ఏఎస్సై సమయస్ఫూర్తితో..

మైలార్‌దేవ్‌పల్లి ఏఎస్సై అబ్దుల్లా గతంలో పాండుతో పాటు సేవ్యాను జైలుకు పంపించాడు. వీరిద్దరూ నిర్మానుష్య ప్రాంతాలతో చెట్ల గుండా పారిపోయేవారు. ఇదే విషయాన్ని క్రైమ్ కానిస్టేబుళ్ల వసంత్, చంద్రయ్య గమనించి పాత నిందితుల జాడను బయటికి తీశారు. పాండుతో పాటు సేవ్యాపై అనుమానం వచ్చి వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. ఇద్దరి నుంచి రూ.11.10 లక్షల విలువ చేసే బంగారు గొలుసులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోగొట్టుకున్న ఆభరణాలు తిరిగి పొందడంతో బాధిత మహిళలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.